క్లుప్తంగా

సీఐకి సన్మానం



ఆస్పరిలో సీఐ హనుమంతప్పను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

ఆస్పరి: మండలంలో మొహర్రం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆస్పరి గ్రామ పెద్దలు సీఐ హనుమంతప్పను శాలువ, పూలమాలలతో సన్మానించారు. మండలంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా పండుగ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నందుకు సీఐని అభినందించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకుంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. ఘర్షణలు, గొడవలు వల్ల సాధించేదేమిలేదన్నారు. జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు మాజీ జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, గ్రామ పెద్దలు తిమ్మన్న, తన్వీనర్ అహ్మద్, షేక్‌సాహెబ్, సంజన్న, తిమ్మప్ప, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర సరిహద్దుకు చేరిన దిగువ కాలువ నీరు



గంగమ్మకు పూజలు చేస్తున్న అధికారులు

హాలహర్వి: కర్నూలు జిల్లాకు తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీటిని ఈనెల 14వ తేదీన బోర్డు అధికారులు విడుదల చేశారు. దీంతో ఆంధ్ర సరిహద్దు అయిన మండలంలోని చింతకుంట వద్దకు ఆదివారం ఉదయం నీరు చేరుకున్నాయి. దీంతో కాలువ ఆఫీసర్లు, ఎస్‌డీఓ హసన్‌బాషా, జేఈలు దుర్గావరప్రసాద్, శ్రీకాంత్, మహేశ్వర్‌రెడ్డి, కాలువ సిబ్బంది, కాల్వ సెక్యూరిటీ గార్డులు, స్థానికులు దిగువ కాలువల వద్దకు చేరుకుని గంగమ్మకు పూజలు చేశారు. కాలువకు నీరు రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

హొళగుంద: మొహర్రం సందర్భంగా మండలంలోని ముద్దటమాగి గ్రామంలో జరిగిన గొడవలో గ్రామానికి చెందిన నాగేంద్ర ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గొల్ల తిమ్మారెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు ఆదివారం తెలిపారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



ప్రత్యేక అలంకరణలో మాళమల్లేశ్వర స్వామి

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ పూజారులు మూల విరాట్‌కు జలాభిషేకం, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



బాలికలకు నగదు, బియ్యం అందజేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో గత శనివారం అనారోగ్యంతో తల్లి శేఖమ్మను కోల్పోయి బాలికలు అనాథలుగా మారారు. విషయం తెలుసుకున్న దూదేకుల సంఘం ప్రెసిడెంట్ మహబూబ్‌బాషా ఆదివారం గ్రామానికి చేరుకుని సంఘం పెద్దలతో మాట్లాడి అనాథ పిల్లలైన వికలాంగురాలు ఆసాబీ, సబియా, అఫ్రీన్‌కు 50 కేజీల బియ్యం ప్యాకెట్, రూ.25 వేల నగదు అందజేశారు. బాలికలకు తాము అండగా ఉంటామని, వారి చదువుకు కూడా సాయం అందిస్తామని వారు భరోసానిచ్చారు. నూర్‌బాషా, ఇమాం కాశీం, సిద్దయ్య, మస్తాన్, మాలిక్, వలీసాబ్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి

మద్దికెర : మండల కేంద్రంలో మూతబడిన ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ ఆదివారం కోరారు. ఏడేళ్ల క్రితం దాదాపు రూ.75 లక్షలు వెచ్చించి నూతన భవనాలు నిర్మించారన్నారు. నిర్మించిన ఏడాదికే కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు లేరనే సాకుతో మూసి వేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి హాస్టల్ తెరిపించాలని పలుమార్లు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు.

ధరల మోత!

ఆకాశంలో డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలు.. వాటిని అనుసరిస్తున్న నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్ల రేట్లు. ఎన్నడూ లేనంతగా ధరలు మండిపోతుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కూరగాయలు, పండ్లు కొనుగోలు చేయడానికి జనం జంకాల్సి వస్తోంది. ధరలు పెరిగిపోతుండటంతో సామాన్యులు కొనుగోలు చేయడం తగ్గించేశారు. రేట్లు పెరుగుతున్నా ప్రభుత్వాలు అదుపులోకి తేవడంలో విఫలమవడంతో జనం అవస్థలు పడుతున్నారు.

- ఆకాశంలో ఇంధన ధరలు
- నిత్యావసర నరుకులతో పాటు పెరిగిన కూరగాయల రేట్లు
- పండ్ల ధరలూ అదే దారిలో..
- వినియోగం తగ్గించిన సామాన్యులు
- పట్టనట్టుగా ప్రభుత్వాలు



నిత్యావసర సరుకులు

తుగ్గలి : రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి కుటుంబాల నడ్డివిరుస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. నెల రోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏ కూరగాయ ముట్టుకున్నా కిలో రూ.50 నుంచి 80 పైనే ఉంది. పప్పుదినుసులు అదే బాటలో పయనిస్తున్నాయి. కంది, మినప, పెసర, శనగ వంటి పప్పు దినుసులు కిలో రూ.120 నుంచి రూ.170 పైకి చేరింది. మార్కెట్‌లో కంది పప్పు సాధారణంగా క్వాలిటీని బట్టి కేజీ రూ.150 నుంచి రూ.170 దాకా ఉంది. మినుములు కేజీ రూ.120 నుంచి రూ.165 దాకా విక్రయిస్తున్నారు. పొట్టు తీసిన మినుపగుళ్ల క్వాలిటీవైతే రూ.200 వరకు అమ్ముతున్నారు. పెసర పప్పు కిలో రూ.110 నుంచి రూ.130 దాకా అమ్ముతున్నారు. శనగ పప్పు సైతం కేజీ రూ.85కు పైనే విక్రయిస్తున్నారు. ఇక వేరుశనగ కిలో రూ.110, వెల్లుల్లి కిలో రూ.220 దాకా ఉంది. దీనికి తోడు నెల రోజుల నుంచి కూరగాయలు ధరలు మండుతూనే ఉన్నాయి. ఉల్లి కిలో రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది. టమాట రూ.70 నుంచి రూ.80, మిర్చి రూ.100 ప్రకారం అమ్ముతున్నారు. బంగాళదుంపలు రూ.60, క్యాప్సికం రూ.70, క్యాబేజీ రూ.60, క్యారెట్ రూ.80, వంకాయలు రూ.70 బెండకాయ రూ.60, కిలో అల్లం రూ. 230 పైనే పలుకుతోంది. కిలో చికెన్ ధర రూ.200 పైనే ఉండగా మటన్ ధర కిలో రూ.750 నుంచి రూ.800 వరకు అమ్ముతున్నారు. సాధారణ ధరలతో పోలిస్తే కొన్ని కూరగాయలు రెట్టింపు ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై కంది పప్పు ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. చౌకదాకాణాల్లో గతంలో ఇస్తున్న కంది పప్పు, చక్కెర కూడా ఇవ్వడం లేదని ప్రజలు వాపోతున్నారు. ధరల ప్రభావంతో రైతులకు మాత్రం ప్రయోజనం చేకూరడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వెంటనే ధరలు తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం ధరలు తగ్గించాలి



ఇటీవల నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు బాగా పెరిగిపోయాయి. టమాట, పచ్చిమిరపకాయలు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసర సరుకుల ధరలు రెండు నెలల క్రితం వరకు బాగానే ఉన్నాయి. ఇప్పుడు అవి కూడా బాగా పెరిగాయి. ప్రభుత్వం ధరలను తగ్గించాలి. – బండ్లపల్లి వెంకటేశ్వర్లు, ముక్కెల్ల



పత్తికొండ మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న వినియోగదారులు

"రైతులకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు



నేను ఎకరాలో మిరప సాగు చేశా. రూ.లక్ష దాకా పెట్టుబడి వచ్చింది. మార్కెట్‌లో కిలో రూ.35 నుంచి రూ.40 దాకా ధర ఉంది. కమీషన్ పోనూ రూ.35 వరకు చేతికొస్తుంది. బాగా కోతకు వచ్చే లోపు ధర తగ్గుతుంది. మార్కెట్‌లో రేటు ఉన్నా పండించే రైతుకు మాత్రం గిట్టుబాటు కావడం లేదు.

– రామునాయక్, రైతు, బాట తండా

ఉన్నవాటితోనే సర్దుకుపోతున్నాం



నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. టమాట, మిరపకాయలు కూడా కొనలేక పోతున్నాం. కంది బ్యాళ్లు కిలో రూ.180 ఉంది. మాలాంటి పేదలం ఏదీ కొనలేకపోతున్నాం. గతంలో బాగానే కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు కొనడానికి జంకుతున్నాం. పచ్చడి మెతుకులతోనే సర్దుకుపోతున్నాం.

– లక్ష్మి, సూర్య తండా

ఎన్నడూ లేని విధంగా ధరలు



మార్కెట్‌లో అన్ని ధరలు పెరిగిపోయాయి. ఏవీ కొనలేని పరిస్థితి. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కూరగాయలు ఏవి కొన్నా కిలో రూ.50 పైనే ఉన్నాయి. ఇక అంగడి సరుకులు చెప్పనక్కర్లేదు. పప్పు దినుసులు అమాంతం పెరిగిపోయాయి. రెండు నెలల క్రితం వరకు కూరగాయలు బాగా కొనగలిగాం. ఇప్పుడు కొనలేకపోతున్నాం. పెరిగిన ధరలతో ఉన్న దాంట్లో సర్దుకుపోవాల్సి వస్తోంది.

– ఏరూరు రంగమ్మ, రామాపురం

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఎమ్మెల్యే విరూపాక్షికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆలూరు: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ (జేఎల్‌ఎం గ్రేడ్-2) ఉద్యోగులకు ఏపీ ఎస్‌ఈబీ సర్వీస్ రెగ్యులేషన్ వర్తించేలా చూడాలని ఎమ్మెల్యే బుసినే విరూపాక్షికి ఆలూరులో పనిచేస్తున్న యూనియన్ నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. యూనియన్ ఆదోని డివిజన్ అధ్యక్షుడు దేవేంద్రప్ప, నాయకులు నాగేంద్రప్ప,కాళప్ప తదితరులు మాట్లాడుతూ సంస్థలో 2019 అక్టోబర్2న 7,329 మంది ఎనర్జీ అసిస్టెంట్లు (గ్రేడ్-2 జేఎల్‌ఎంలు)గా నోటిఫికేషన్ ద్వారా నియమించారన్నారు. అయితే సంస్థలో ఆపరేషన్, నిర్వహణ (ఓ అండ్.ఎం) రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే విధులను నిర్వహిస్తున్నామన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లుగా విధులను నిర్వహిస్తున్న వారు విద్యుత్ ప్రమాదంలో రాష్ట్ర వ్యాప్తంగా 270 మంది వరకు ప్రాణాలను కోల్పోగా 150 మంది వరకు అంగవైకల్యంతో బాధపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివరాలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి



మాట్లాడుతున్న జగన్నాథం

ఆలూరు: 2022–23లో ఖరీఫ్, రబీలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు బీమా పరిహారం మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో నియోజకవర్గ రైతు సంఘం నాయకులతో జనరల్ బాడీ సమావేశం మండలం అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందుకు జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జగన్నాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతుల ఇబ్బందులపై దృష్టి సారించడంలేదన్నారు. రైతు శ్రేయస్సు కోసం ఈనెల 28,29, 30వ తేదీల్లో మనపల్లిలో నిర్వహిచనున్న రైతు సమ్మేళనం సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు భూపేష్,ఆలూరు, హొళగుంద మండల సీపీఐ కార్యాదర్శులు రామాంజనేయులు,రంగన్న, జిల్లా నాయకులు రంగన్న,గోపాల్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించండి సారూ!

చిప్పగిరి: మండలంలోని నంచర్ల గ్రామంలో పలుకాలనీలకు నీటిని అందించే పైప్‌నకు ఉన్న వాల్వ్ మరమ్మతులకు గురి కావడంతో ఆయా కాలనీలకు వారం రోజులుగా నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి ఏ ఇతర జలాశయల నుంచి నీటి సౌకర్యం అందుబాటులో లేదు. గ్రామంలో ఉన్న బోరు ద్వారా మాత్రమే నీటిని అందిస్తున్నారు. సమస్య తలెత్తినా పట్టించుకోకపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు.

నంచర్లలో మరమ్మతుకు నోచుకోని వాల్వ్ →



విత్తన విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): చట్టాలకు లోబడి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలని విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త జయచంద్ర ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలు, రిజిష్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గోదాముల్లో విత్తనాలు, ఎరువులను ఒకేచోట ఉంచరాదన్నారు. పురుగు మందులు, కలుపు మందులను రైతులకు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒకసారి వాడిన డబ్బాల్లో మందు మిగిలితే ఇంట్లో భద్రపరచాలని, పిల్లలకు అందుబాటులో ఉంచరాదన్నారు. వ్యవసాయ చట్టాలకు అనుగుణంగా మార్గదర్శకాలు పాటించాలని ఆదేశించారు. డీలర్లకు సెమినార్ నిర్వహించారు. ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



వీధి లైట్లు వెలగక అంధాకారంలో ఉన్న హైవే 167లోని ఆలూరు ప్రధాన రహదారి

అంధకారం!

- ఆలూరులో రెండు నెలలుగా వెలగని విద్యుత్ దీపాలు



వాహనం ఢీకొని నేల కొరిగిన విద్యుత్ స్తంభం

ఆలూరు రూరల్: పట్టణంలోని ప్రధాన రహదారి హైవే–167లో వీధి లైట్లు వెలగడం లేదు. రెండు నెలలుగా విద్యుత్ సరఫరాలో సాంకేతిక లోపంతో ఇవి పనిచేయడం లేదు. ప్రధాన రహదారిలో రాత్రి పూట వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి తోడు రోడ్లపై పశువులు అడ్డంగా నిలబడతుండడంతో చీకట్లో కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంధకారం కారణంగా నడిచి వెళ్లే ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. 2015లో రూ.16 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో పట్టణంలోని ప్రధాన రహదారిలోపేన్న అంబేడ్కర్ సర్కిల్ నుంచి గుంతకల్లు చెక్‌పోస్టు వరకు 11 వీధిలైట్లను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు స్తంభాలు వాహనాలు ఢీకొట్టడంతో నేలవాలాయి. రెండు వీధి స్తంభాల లైట్లు పనిచేయడం లేదు. ప్రస్తుతం ఉన్న 6 వీధిలైట్లు రెండు నెలలుగా సాంకేతిక లోపంతో వెలగడం లేదు. పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



మద్దికెరలో పూజలందుకుంటున్న సాయినాథుడు,



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



అన్నదానం చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



హొళగుందలో సాయిబాబదర్శనానికి తరలి వచ్చిన భక్తులు



మొక్కులను చెల్లించుకునేందుకు వెళ్తున్న భక్తులు

మద్దికెర : స్థానిక సాయి మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు కాగడ హారతి, 6 గంటలకు గణపతి, దత్తాత్రేయ పూజ, నందీశ్వరుడు, సాయిబాబాకు పంచామృతాభిషేకం, అష్టోత్తర పుష్పార్చన, మంత్రపుష్పం, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం మధ్యాహ్న హారతి, సాయంత్రం, రాత్రి ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు ముగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

ఆలూరు/ఆలూరు రూరల్: గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉపాధ్యాయనగర్ కాలనీలో కొలువుదీరిన సాయిబాబాను అర్చకులు ఎర్రిస్వామి ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం బాబాకు ఫల, పుష్ప,పంచామృతాభిషేకం, మహామంగళహారతి పూజలు చేశారు. బాబా దర్శనం కోసం భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే ఆలూరు మండలంలోని కమ్మరచేడు గ్రామంలో ఆనంద సాయి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాత్రికి, మనేకుర్తి, అంగస్కల్లు, గోనేహాల్, మరకట్టు, మూసానహల్లి గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఉదయం బాబాకు జలాభిషేకం అనంతరం మహామంగళారతి, కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకములు, చందనోత్సవం, సాయి స్తోత్రము, మధ్యాహ్న హారతి తదితర కార్యక్రమాలు జరిపించారు. భక్తులు తరలివచ్చి బాబాను దర్శించకున్నారు.

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థం, బిణిగేరిలోని పంచలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచలింగ్వేరస్వామి ఆలయంలో ఆధ్యాత్మిక గురువు శ్రీనివాసులు నాయన దంపతులను శిష్యులు సన్మానించారు. అలాగే రామతీర్థంలో గురువులు రాఘవేంద్రరావు, కృష్ణానంద స్వామి వారి సమాధికి నిర్వాహకులు రూపామోహన్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి చిత్ర పటాలను మేళ తాళాలతో ఊరేగించారు.



బొమ్మిరెడ్డిపల్లెలో వేద వ్యాసుడి చిత్రపటానికి పూజలు చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు



వెల్దుర్తిలో సాయినాథుని హారతిలో పాల్గొన్న భక్త జనం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలంలోని బొమ్మిరెడ్డి పల్లె హైవే పక్కన వెలసిన అన్నపూర్ణ సహిత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రసార విభాగం సారధ్యంలో ఆలయ ధర్మకర్త పూడూరు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమి నిర్వహించారు. వెల్దుర్తి అభయాంజనేయస్వామి ఆలయ పీఠాధిపతి చిన్న రామాంజనేయులు, వెల్దుర్తి, ఓర్వకల్ ప్రఖండ ధర్మరక్షక్ బీకే తిమ్మయ్య, ఎర్రమలతో కలిసి వేద వ్యాసుడి చిత్రపటానికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వెల్దుర్తిలోని జర్నలిస్టు కాలనీలో వెలసిన వెంకటేశ్వర, అయ్యప్ప, సాయినాథ ఆలయ సమూహంలో సాయినాథుని హారతిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాలిపోతున్నాయ్!

హొళగుంద: మార్లమడికి, నాగరకన్వీ, హొన్నూరు కొట్టాల గ్రామ పరిధిలోని పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు కిందపడిపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటాయని రైతులు, అటువైపు తిరిగే వారు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడం, రైతులు పంటలు సాగు చేసుకునే సమయంలో ప్రమాదకరంగా ఉన్న స్తంభాల దగ్గరకు వెళ్లేందుకు జంకుతున్నారు. కొద్ది రోజుల్లో వరి నాట్లు వేసేందుకు పొలాల్లో నీటిని నిల్వ ఉంచనున్నారు. ఈ సమయంలో అవి కిందపడితే ప్రమాదం జరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా వాలిపోయాయని, పెద్దగా గాలి వీస్తే పడిపోతాయని చెబుతున్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



మార్లమడికి పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

రోడ్డు బాగుపడేనా!

- నిట్రవట్టి–ఆలూరు మెయిన్ రోడ్డు శిథిలం
- గుంతలమయమైన రహదారిపై నిత్యం ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారిన నిట్రవట్టి–ఆలూరు రహదారి

హాలహర్వి: ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు శిథిలమై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వాటిని మరమ్మతు చేయడం లేదు. మండలంలోని నిట్రవట్టి–ఆలూరు మెయిన్ రోడ్డు 5 కి.మీ. రోడ్డును 15ఏళ్ల క్రితం వేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు గుంతలు పడి అధ్వానంగా మారింది. కురుస్తున్న వర్షాలకు వాహనాల రాకపోకలతో గుంతలు మరింత పెద్దగా మారాయి. ఈ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ముఖ్యంగా ఆటోలు, ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడుతున్నారు. రోడ్డు సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు శిథిలం కావడంతో గ్రామానికి చివరకు 108 వాహనం రావడానికి సిబ్బంది సుముఖత చూపడం లేదు. ఏదైనా అత్యవసరమైతే ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే రోడ్డును బాగు చేయాలని వారు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు



నిట్రవట్టి–ఆలూరు మెయిన్ రోడ్డు అధ్వానంగా మారిందని, బాగు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు గతంలో పలుమార్లు విన్నవించుకున్నాం. కానీ పట్టించుకోలేదు. రోడ్డు మొత్తం గుంతలు పడటంతో ఏదైనా అత్యవసరమైతే ప్రయాణం చేయాలంటే భయపడుతున్నాం. మా ఊరి రోడ్డును బాగుచేసే నాథుడే లేడు.

– బొగ్గులు మారన్న, నిట్రవట్టి

నిత్యం ప్రమాదాలే



5 కి.మీ. రహదారిలో నిత్యం ఏదో ఒక ప్రమాదం చోటు చేసుకుంటుంది. టూవీలర్ వాహనదారులు ఎంత జాగ్రత్తగా నడిపినా మోకాలు లోతు గుంతలు ఉండడంతో గుంతల్లో వాహనం ఇరుక్కుపోయి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డును ఎప్పుడు బాగు చేస్తారో కూడా తెలియని పరిస్థితి. – శేషగిరి, గ్రామస్తుడు